కనుల పండువగా కల్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న దృశ్యం


కల్యాణ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు

మన్సూరాబాద్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిపి అన్నప్రసాద వితరణ చేశారు. జడ్జెస్‌కాలనీ ఫేజ్–1లోని భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆది దంపతుల కల్యాణ వేడుకలను చేపట్టారు. అనంతరం కాలనీలోని వీధుల గుండా దేవ దేవతల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజయ్యగౌడ్, రంగారెడ్డి, కాలనీ, అలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జైపురికాలనీ సమీపంలో

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ సమీపంలోని శ్రీమల్లికార్జున హిల్స్ శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగోలు, కొత్తపేట కార్పొరేటర్లు చింతల అరుణ, నాయికోటి పవన్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతల కిరణ్ కుమార్ యాదవ్, ఆగమయ్య, చింతల మహేందర్ యాదవ్, సిద్దల ఐలయ్య, వస్పరి శంకర్, సతీష్ యాదవ్, సిద్ధల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌తో బర్డ్‌ఫ్లూ అపోహ మాత్రమే



చికెన్‌పై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

చంపాపేట: చికెన్ తినటంతో బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతుంది అనేది అపోహ మాత్రమే అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. గురువారం చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో చికెన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చికెన్ మేళాకు ఆయన హాజరై స్థానికులకు ఉచితంగా చికెన్ ఫ్రై కవాబులు, కోడి గుడ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాంసాహారాన్ని 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి వినియోగిస్తే ఎలాంటి వైరస్ సోకదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, సంఘం నిర్వాహకులు ఖాదర్, కృష్ణ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి నాయకులు సదానంద్‌రెడ్డి, రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి కర్మన్ ఘాట్, మాధవనగర్, డిఫెన్స్ కాలనీలో లో వోల్టేజీ, లో ప్రెజర్ తాగునీటి సరఫరా, అసంపూర్తి దశలో కాలనీ సంక్షేమ సంఘం భవనాల నిర్మాణాలు తదితర సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కళ్యాణ్‌చక్రవర్తి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఎంపీని సన్మానిస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలోని గ్రౌండ్‌లో స్వామి వివేకానంద క్రాంతి సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించే డే అండ్ నైట్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ్ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మహా శివరాత్రి సందర్భంగా గత 40 ఏళ్లుగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు భాస్కర్, శరత్, కళాచైతన్య తదితరులు పాల్గొన్నారు.

మయోపియా క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మోహన్ కన్నం, శ్రీనివాస్ ముర్కి

వనస్థలిపురం: డిజిటల్ ఎక్స్‌పోజర్ పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారుల్లో మయోపియా, అస్టిగ్మటిజం వంటి కంటి సమస్యలు అధికమవుతున్నాయని ప్రముఖ కంటి వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలల నేత్ర ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని భారతదేశంలోని ప్రముఖ నేత్ర చికిత్సా సంస్థ సెంటర్ ఫర్ సైట్ హైదరాబాద్‌లోని వనస్థలిపురం కేంద్రంలో ప్రత్యేకంగా మయోపియా క్లినిక్‌ను ప్రారంభించింది. క్లినిక్‌ను గురువారం ప్రముఖ శిశు రోగ నిపుణులు డా.శ్రీనివాస్ ముర్కి ప్రారంభించగా, ప్రముఖ పిల్లల నేత్ర వైద్య నిపుణులు డా.మోహన్ కన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మయోపియా క్లినిక్‌లో ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా పిల్లలకు ప్రామాణిక చికిత్సలు అందించనున్నామన్నారు. లక్షలాది మంది ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న తమ సంస్థ హైదరాబాద్‌లో మయోపియా క్లినిక్‌ను ప్రారంభించిందన్నారు. మయోపియా, పిల్లల నేత్ర సమస్యలు, కణజాల చికిత్సలు, రెటినా, గ్లాకోమా, కటరాక్ట్, కణితి సంబంధిత నేత్ర వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సి.వెంకట్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

- రోడ్లపై గంటల తరబడి వాహనాల నిలిపివేత
- నడిచే దారిలేక పాదచారులకు ఇబ్బందులు



ట్రాఫిక్‌తో పరేషాన్

నాగోలు: రహదారులు, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యతో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ల ముందు గంటల తరబడి వాహనాలు నిలుపుతుండటంతో ఇతర వాహనదారులు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది.కొందరు ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమిస్తుండటంతో బాటసారులు నడిచేందుకు స్థలం లేకుండా పోతోంది. మరో పక్క ఆటోలు బస్టాప్‌లు, ప్రధాన జంక్షన్లలో ఆగకుండా, రోడ్లను ఆక్రమించి ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తున్న వారికి అన్ని శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఫుత్‌పాత్‌ల కబ్జాలు మాత్రం ఆగడం లేదు.

ఫుట్‌పాత్‌లు సైతం కబ్జా

ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తుండటంతో బాటసారులు ప్రమాదకరంగా నడిరోడ్డుపై రాకపోకలు సాగించాల్సి దుస్థితి నెలకొంది. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోలు, కొత్తపేట, మోహన్‌నగర్, బండ్లగూడ ప్రాంతంలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు వద్ద ఎలాంటి పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని అల్కాపురి చౌరస్తాలో ఉన్న లక్కి హోటల్ ముందు ఉదయం,


కొత్తపేటలో తోపుడు బండ్లు రోడ్డుపై అడ్డంగా పెట్టడంతో స్తంభించిన ట్రాఫిక్


నాగోలు సాయినగర్‌లోని లక్కీ హోటల్ ముందు రోడ్డుపై పార్కింగ్

సాయంత్రం వాహనదారులు రోడ్డుపై పార్కింగ్ చేయడంలో పెద్ద ఎత్తున్న ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. సాయినగర్ కాలనీ రోడ్డు నెంబర్–3లో వెళ్లే కాలనీవాసులు అక్రమ ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాగోలు నుంచి బండ్లగూడ వెళ్లే రహదారిపై ఓ సర్వీసింగ్ పాయింట్ ఉంది. సర్వీసింగ్‌కు వచ్చి కార్లు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో నాగోలు నుంచి బండ్లగూడ ఓఆర్ఆర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో ఉన్న వైన్స్, బార్ వద్ద చేస్తున్న అక్రమ పార్కింగ్‌తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం స్తంభించే ప్రాంతాలివే..

నాగోలు–బండ్లగూడ వెళ్లే దారిలో ఉన్న భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో కార్లు రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేయడంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది.కొత్తపేట నుంచి విజయవాడ జాతీయ రహదారిపై బీజేఆర్ భవనం, అష్టలక్ష్మీ కామన్ సమీపంలో రాత్రి సమయంలో తోపుడు బండ్ల రోడ్డుపై అండగా పెట్టి వ్యాపారం చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. అల్కాపురి చౌరస్తాలో లక్కీ రెస్టారెంట్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మన్సూరాబాద్ వెళ్లే దారిలో తిరుమల బార్‌వద్ద రాత్రి సమయంలో వాహన దారులు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తుయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుంది. నాగోలు చౌరస్తాలో నుంచి బండ్లగూడ వెళ్లే దారిలో ఉదయం, సాయంత్రం సమయంలో రోడ్డుపై ఆటోలు అక్రమంగా పార్కింగ్ చేయడంతో అక్కడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నాగోలు నుంచి బండ్లగూడ వెళ్లే దారిలో పీబీఆర్ పంక్షన్ హాల్, బార్ వైన్స్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గురువారం సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చిత్రా లేఅవుట్ ఫీడర్ పరిధి కాలనీలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, 11కేవీ హరిపురి కాలనీ ఫీడర్ కింద మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంట వరకు, 11కేవీ జైన్ మందిర్, కమలానగర్, శారదానగర్, ఆర్‌కేపురం ఫీడర్ల పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే సమీక్ష

మహేశ్వరం: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 9.30గంటలకు పలు అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నామని పీఏసీఎస్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పాల్గొననున్నారని తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

మీర్‌పేట: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ సహకారంతో బీజేపీ మీర్‌పేట కార్పొరేషన్–2 అధ్యక్షుడు తులసి ముఖేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.2500ల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టామని, భవిష్యత్తులోనూ అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మహిళా సంక్షేమానికి కృషి


కార్పొరేటర్ సన్మానిస్తున్న మహిళలు

వనస్థలిపురం: మహిళా సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సాహెబ్‌నగర్‌లోని మహిళా సంక్షేమ సంఘం భవనాన్ని గురువారం ఆయన సందర్శించారు. మహిళా సంక్షేమ సంఘం భవనం అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ. 12.80 లక్షలు నిధులు మంజూరు చేయించిన కార్పొరేటర్‌ను మహిళలు సత్కరించారు. కార్యక్రమంలో పద్మ, అర్చన, అరుణ, గౌతమి, లావణ్య, లక్ష్మమ్మ, అరుణ, పుష్ప, విజయలక్ష్మి, జ్యోతి, నాయకులు మహేష్‌గౌడ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

హయత్‌నగర్: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహర్‌కు చెందిన దుకణ్ కుమార్(26) ఆదే ప్రాంతానికి చెందిన అంజనీదాస్, దర్మేందర్‌కుమార్‌తో కలిసి పెద్దఅంబర్‌పేట్‌లో హనుమాన్ ఎర్త మూవర్స్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అప్పుల బాధతో మనస్తాపానికి గురవుతుండేవాడు. మంగళవారం రాత్రి తోటి కార్మికులు రాత్రి భోజనం తర్వాత పడుకున్నారు. పక్కనే ఉన్న గదిలోకి వెళ్లిన కుమార్ ఉరేసుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు మేఘనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యం


కమలాకర్

హయత్‌నగర్: పని కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అన్మగల్ హయత్‌నగర్ సాయినగర్ కాలనీకి చేందిన పెరుమాళ్ల కమలాకర్(44) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఇద్దరు కూతుళ్లు ఓ కుమారుడు ఉన్నాడు. ఈ నెల 23న పని కోసం వెళ్లిన కమలాకర్ రాత్రైనా ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య మణెమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి విక్రయిస్తున్న యువకుడిపై కేసు


గంజాయిని, నగదుతో పట్టుబడ్డ యువకుడిని చూపిస్తున్న అధికారులు

మలక్‌పేట: గంజాయి విక్రయిస్తుండగా ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న ఘటన మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి వివరాల ప్రకారం.. తలాబ్ కట్టా ప్రాంతంలోని జీషాన్ స్కూల్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు చేసి సయ్యద్ మగ్దుమ్(21)ను పట్టుకుని 1.4 కిలోల గంజాయితో పాటు రూ.70,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. మగ్దుమ్‌తో పాటు మహ్మద్ వాజీద్, ఎండీ జావేద్‌పై కేసు నమోదు కాగా ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు



బడంగ్‌పేట్: నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు అని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహమ్మద్ సాహేర్ అన్నారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని తెలిపారు. గురువారం బడంగ్‌పేట్ జైరాం స్టీల్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినిమోగదారులకు సంస్థ ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. కాంక్రిట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని చెప్పారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్టెట్‌కు రూ.20 అధికంగా ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ బృందం, 50 మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సెల్లార్లలో దుకాణాలు.. రోడ్లపైనే వాహనాలు

- కుంచించుకుపోతున్న రహదారులు
- తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు


పనామా డబుల్ రోడ్డులో సెల్లార్లలో కొనసాగుతున్న వ్యాపారాలు, రోడ్డుపై పార్కింగ్

వనస్థలిపురం: వాణిజ్య భవనాల్లో వాహనాల పార్కింగ్ కోసం నిర్మించిన సెల్లార్లు వ్యాపారాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయా భవనాల్లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో అక్కడికి వచ్చిన వినియోగదారులు తమ తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌లతో రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, కర్మన్‌ఘాట్, చంపాపేట, కొత్తపేట, చైతన్యపురి, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై ఎన్నో వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. మొదట్లో ఆయా వాణిజ్య భవనాల్లో



సెల్లార్లను పార్కింగ్ కోసం వినియోగించేవారు. కానీ ప్రధాన రోడ్లపై ఉన్న భవనాలకు అద్దెలు ఎక్కువగా వస్తుండడంతో భవనాల యజమానులు సెల్లార్లను సైతం వ్యాపారాలకు అద్దెకిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్లపై ఉన్న సెల్లార్లు 50 శాతానికి పైగా వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి.

సంబంధిత అధికారుల మౌనం..

వాణిజ్య భవనాల్లో పార్కింగ్ కోసం నిర్మించిన సెల్లార్లను నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సంస్థలకు అద్దెకిస్తున్న భవన యజమానులపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సెల్లార్లలో సైతం వ్యాపారాలను నిర్వహిస్తుండడంతో పార్కింగ్ వసతి లేక వాహనాలను రోడ్లపైనే నిలపాల్సిన దుస్థితి నెలకొంది. టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యంతో భవనాల్లో పార్కింగ్‌కు స్థలం లేకుండా పోతోందని. దీంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నేడు జైళ్లశాఖలో సమావేశం

చంచల్‌గూడ: తెలంగాణ జైళ్ల శాఖ ఆధునీకరణలో భాగంగా సిబ్బందికి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు చంచల్‌గూడలోని సీకా ఆడిటోరియంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వీవీ శ్రీనివాస్‌రావు ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు.

నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్: ఆర్టీసీ హయత్‌నగర్–1,2 డిపోల పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు జలగం విజయ్, శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో 995922518, 9959226419 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.18, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.36, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.28, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.43, మునగ రూ.45, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.18, కీర రూ.23, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.35.

ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ముగిసిన రుద్రాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీశృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం (శ్రీ శృంగేరి శంకరమఠం)లో సువర్ణభారతీ మహోత్సవంలో భాగంగా 1311 రుద్రములతో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రుద్రపారాయణ సహిత విశేష రుద్రాభిషేకం గురువారంతో ముగిసింది. సామూహిక రుద్రాభిషేకం నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ బంగారయ్య, సూర్యనారయణ శర్మ, గౌరి భాస్కర్, సుధాకర్ శర్మ, శోభనాద్రి, కేవీఎల్ నరసింహమూర్తి, వ్యాప్‌కుమార్ పాల్గొన్నారు.